# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ గురువారం | 2 జనవరి 2025 | ■ 8 పేజీలు


## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం హుళక్కేనా..?



ఇచ్చిన హామీలను మరచిన ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెను శతవిధాల బ్రేక్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక వైపు జిల్లా విద్యాశాఖ అధికారుల నుండి బుజ్జగింపుల పర్వానికి తెరలేపి.. అదే సమయంలో టర్మినేట్ చేస్తామంటూ హెచ్చరిస్తున్నట్లు సమాచారం. కేజీబీవీ పాఠశాలలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసింది.

వివరాలు 8లో



## శార్దుల వాహిని జంగుబాయి

# దీపమే.. దైవం..!



■ ప్రభాతసమాచారం, ప్రత్యేక ప్రతినిధి

■ సహ్యాద్రి పర్వత పంక్తుల్లో అడవి బిడ్డల సంబురం ■ నేటి నుంచి జంగుబాయి అమ్మవారి ఉత్సవాలు ■ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో పుణ్యక్షేత్రం

■ ఆదివాసీల అరుదైన ఆరాధన.. ప్రత్యేక పూజలు ■ వివిధ రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తుల రాక ■ నేటి నుంచి నెల రోజుల పాటు పూజలందుకోనున్న అమ్మవారు

అడవుల జిల్లా గుండా వెళ్లే సహ్యాద్రి పర్వతాలు సుందర దృశ్యాలు.. కమనీయ జలపాతాలు నిగూఢమైన గుహలకు నిలయాలు..ఈ పర్వత శ్రేణులు అద్భుత ప్రపంచాలు. గోండు గిరిజ నులకు ఇష్టమైన జంగుబాయి లోయ ఈ పర్వత శ్రేణుల్లోనే ఉంది. జంగుబాయి దుర్గామాత ప్రతిరూ పమేనని గోండు ఆదివాసులు నమ్ముతారు. అందుకే వారు ప్రతీ సంవత్సరం పుశ్యమాసంలో నెల రోజుల పాటు ఆమెను ఎంతో నిష్టతతో కొలుస్తారు. ప్రకృతితో ఆదివాసీలకు విడదీయరాని బంధం ఉంది. అడవే జీవనాధారం. భాష.. వేషధారణ.. పూజలు.. పండుగలు... ఇలా ప్రతి అంశంలోనూ వీరి జీవన శైలి విభిన్నంగా ఉంటుంది. ఏడాది పొడవునా ప్రకృతి దేవతలను ఆరాధిస్తుంటారు. పుష్యమాసంలో జంగుబాయి అమ్మవారిని దర్శించుకోవడం ఆదివాసీలకు ఆనవాయితీ. అమ్మవారి దర్శనానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేస్తుంటారు. నెలవంక కనిపించిన వేకువజామున ప్రారంభమయ్యే జాతర ఈసారి నేటి నుంచి షురువవుతుంది. నెల రోజుల పాటు కొనసాగుతుంది. అడవి తల్లి బిడ్డల నృత్యగానాల కోలాహలంతో ఆ ప్రాంతమంతా మారు మోగుతుంది. ఉట్నూర్ డివిజన్‌లోని నార్నూర్ మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో జంగుబాయి ఆలయం ఉంది.



## భక్తితో ఆరంభం

నూతన సంవత్సరాన్ని జిల్లా ప్రజలు భక్తితో ఆరంభించారు. బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ఆలయాలు కిటకిటలాడాయి. వందలాది మంది భక్తులు కుటుంబసమేతంగా రుద్రేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సామూహిక రుద్రాభిషేకాల్లో పాల్గొన్నారు. క్రిస్టియన్లు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళలు ఇళ్ల ఎదుట తీరొక్క ముగ్గులు వేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.



## తగ్గేదేలే?

# కిక్కే.. కిక్కు!

■ ఒక్క రోజులోనే రూ.20కోట్లకుపైగా మద్యం విక్రయాలు ■ మూడింతలు పెరిగి రికార్డు ■ చికెన్, మటన్‌దీ అదే దారి

■ కొత్త సంవత్సర వేడుకల్లో సరికొత్త రికార్డు ■ ఉమ్మడి జిల్లాలో ఆబ్కారీ ఖజానాకు కాసులు కురిపించిన డిసెంబర్ 31

■ పది రోజుల గణాంకాలు తీస్తే మరింత పెరిగే ఛాన్స్ ■ గతేడాది కంటే ఈ సారి భారీగా పెరిగిన మద్యం విక్రయాలు..

కొత్త సంవత్సర ఆహ్వాన వేళ.. ఆబ్కారీ శాఖ పంట పండింది. గత ఏడాదితో పోలిస్తే 40%పైగా మద్యం విక్రయాలు పెరిగాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో డిసెంబర్ 31 ఉదయం మొదలు... 2025 కొత్త సంవత్సరం జనవరి ఒకటో తేదీ ఎంట్రీ అయ్యే సమయానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.20 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఆదిలాబాద్ జిల్లాలో మూడు కోట్ల 20 లక్షలు, నిర్మల్ జిల్లాలో మూడు కోట్ల ఆరు లక్షలు, మంచిర్యాల జిల్లాలో రూ.7కోట్ల మూడు లక్షలు, కుమ్రంభీం జిల్లాలో రూ.2 కోట్ల 5లక్షల చొప్పున మద్యం విక్రయాలు జరిగాయి. అయితే సింగరేణి సహా కార్మికులు భారీ మొత్తంలో ఉండే మంచిర్యాల ఒక్క జిల్లాలోని ఏడు కోట్లకుపైగా మద్యం విక్రయాలు జరగడం విశేషం. గత ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 కోట్ల మద్యం విక్రయాలు జరగగా. ఈ ఏడాది రూ.20 కోట్ల విక్రయాలు జరగడం ఆబ్కారీ శాఖ అధికారుల్లో సంతోషాన్ని నింపింది. మద్యంతో పాటు మాంసం విక్రయాలు కూడా ఊపందుకున్నాయి.



## నూతన ఆలోచనలతో ముందుకు..

■ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రముఖులు



## ఉన్నత స్థాయికి ఎదగాలి

■ చదువుకు వైకల్యం అడ్డు రాదు

■ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్..



ఎట్టకేలకు అటవీ శాఖ అధికారులకు

# చిక్కిన పులి

■ మహారాష్ట్ర-చంద్రపూర్ సరిహద్దులో పులిని చాకచక్యంగా బోనులో బంధించిన అటవీ అధికారులు

■ వైద్య పరీక్షల కోసం చంద్రపూర్‌కు తరలింపు

■ చికిత్స తర్వాత తడోబా పులుల సంరక్షణ కేంద్రంలో పులిని వదిలి పెట్టనున్నట్లు సమాచారం..

# సామాజిక న్యాయం కోసం మాలీలు ఏకం కావాలి

**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)** గత 24 సంవత్సరాలుగా మాలికులస్తులు సామాజిక న్యాయం కోసం అనేక పోరాటాలు చేశారని అయిన పూర్తిస్థాయిలో మాలీలకు సామాజిక న్యాయం లభించలేదని దానికోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న మూడు లక్షల మంది మాలి కులస్తులు ఏకం కావాలని అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 12న ఆసిఫాబాద్ జిల్లాలో మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు జరగనున్నాయని దానికోసం ఓటర్లుగా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 250 గ్రామాల్లో నివసిస్తున్న మాలి పెద్దలు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి ఇద్దరు ఓటర్లు ఓటు వేసి రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకుంటారని అన్నారు. అలాగే జనవరి మూడో తేదీన భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు కాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన జరుపుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, పటేల సంఘం జిల్లా అధ్యక్షులు షిండే గంగారం, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు అడ్వకేట్ ఉమేష్ రావు డోలే, జిల్లా కార్యవర్గ సభ్యులు విట్టల్ కొట్రంగే పాల్గొన్నారు.



## విస్తృతంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు



**మంచిర్యాల, జనవరి 1 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లా కేంద్రంలో నూతన సంవత్సరం వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. రామగుండం సీపీ శ్రీనివాస్ తనిఖీలను పర్యవేక్షించారు. మద్యం సేవించి పట్టు బడిన వారికీ కౌన్సిలింగ్ నిర్వహించారు.అవంచనియా సంఘటనలు జరగకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించినట్లు, శాంతి భద్రతలకు భంగం కలుగకుండా కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు గొడవలు కు తవివ్వకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీపీ పేర్కొన్నారు. మద్యం తాగి పట్టు బడిన వారిపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డిసిపీ ఏ. భాస్కర్, ఏసీపీ ఆర్ ప్రకాష్, సీఐ లు ప్రమోద్ రావు నరేష్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీఎస్.యూటీఎఫ్ వెంకట్‌ను అభినందించిన ప్రజాసంఘాలు



**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)** టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అదిమూలం వెంకట్‌కు ప్రజా సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. నల్గొండలో మహాసభలు ముగిసిన అనంతరం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయనను బుధవారం బాశెట్టి మాధవ రావుకు విజ్ఞాన కేంద్రం లో వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యతులో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అభినందించిన వారిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, అగ్గిమల్ల స్వామి,జిల్లా కమిటీ సభ్యులు దర్శనాల నగేష్, ఆర్. సురేందర్, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శకుంతల, జమున, కోశాధికారి మంజుల, నాయకులు ఆశన్న, పంచాపూల, విజయ, పోచక్క ఉన్నారు.

## లేబర్ కార్డుపై కార్మికులకు అవగాహన



**బోథ్ (ఆదిలాబాద్), జనవరి 1 (ప్రభాత సమాచారం)** మండల కేంద్రంలోని భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ లేబర్ కార్డు ఉపయోగాల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంఘటిత, కార్మిక రంగాలలో పనిచేసే కార్మికులకు ఆపద సమయంలో అక్కున చేర్చుకునేది లేబర్ కార్డు ఈ కార్డు అన్ని రకాలుగా కార్మికులకు ప్రయోజనాలు చేకూర్చుతుంది. లేబర్ కార్డు కలిగిన కార్మికులు సహజ మరణం చెందితే లక్ష 30 వేల రూపాయలు ఇన్సూరెన్స్ వస్తుందని, అదే విధంగా ప్రమాదవశాత్తు పనిచేస్తున్న క్రమంలో మరణిస్తే ఆరు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ వస్తుందన్నారు. ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు ఉంటే ఒక్కొక్కరికి వివాహ ఖర్చుల నిమిత్తం 30 వేల రూపాయలు ప్రభుత్వం వారి తరఫున బ్యాంకులో డిపాజిట్ చేస్తుందన్నారు. ప్రతి సంవత్సరం కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఇంకా ఒక్క మాటలో చెప్పాలంటే కార్మికుల కోసం రక్షణగా ఉండేదే ఈ లేబర్ కార్డు. మండలంలో కొన్ని వేల మంది కార్మికులు కార్మిక రంగంలో పని చేస్తుంటే కేవలం కొన్ని వందల మందికి మాత్రమే ఈ కార్డు ఉంది. ఈ కార్డు ప్రయోజనాలు తెలియక చెప్పేవారు లేక అవగాహన లోపంతో దూరం అవుతున్న భవన నిర్మాణ కార్మి కులు ఇప్పటికైనా అధికార యంత్రాంగం కార్మికులకు లేబర్ కార్డు ప్రయోజనాలను కార్మికులకు తెలిసే విధంగా సదస్సులు, సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కార్పె శ్రీనివాస్, ఇప్ప శ్రీనివాస్, తిరుపతి, ఆరే రమేష్, ఆరేపల్లి రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.



## విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి

**నిర్మల్, జనవరి 1 (ప్రభాత సమాచారం)** బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కేజీబీవీ విద్యార్థినులతో కలిసి ఉదయం పూట అల్పాహారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటిస్తూ, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. నూతన సంవత్సరంలో నూతన ఉత్సాహంతో ముందు కెళ్లాలని సూచించారు. విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్వీస్ ప్రమోషన్ కాపీల అందజేత



**మందమర్రి, జనవరి 1 (ప్రభాత సమాచారం)** మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిలో 22 మంది కార్మికులకు బుధవారం సర్వీస్ లింకెడ్ ప్రమోషన్ ఆర్డర్లను గని ఇన్‌చార్జి మేనేజర్ రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులు వారి వ్యక్తిగత జీవితంలో లక్ష్యాలతో పాటుగా, రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్మికులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## ట్రస్ట్ భూమిని కాపాడుకోవాలి

**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)** పూలే, అంబేద్కర్ బుద్ధ భూమి సామాజిక ట్రస్ట్‌కు ప్రభుత్వం కేటాయించిన భూమిని కాపాడడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని పూలే, అంబేద్కర్ బుద్ధభూమి ట్రస్ట్ అధ్యక్షులు విజయ ఉప్రే, భారతీయ బౌద్ధమసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మాహుల్కర్, సమాజ్ క్రాంతి ఆగాడి జిల్లా అధ్యక్షులు దుర్గం తిరుపతి అన్నారు. బుధవారం శౌర్య డివోషనల్ పురస్కరించుకొని బెండార గ్రామంలోని బోడగుట్ట వద్ద ట్రస్ట్‌కు ప్రభుత్వం కేటాయించిన భూమిని పలు సంఘాలతో కలిసి పరిశీలించారు.

## బుద్ధ విహార్‌లో శౌర్య దివస్

**వాంకిడి, జనవరి 1 (ప్రభాత సమాచారం)** వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బుధవారం 207వ శౌర్య దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమా కోరేగావ్ యుద్ధ భూమిలో అమరులైన వీరులకు స్థూపాన్ని ఏర్పాటు చేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బౌద్ధ సమాజ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్, పూలే అంబేద్కర్ బుద్ధ భూమి ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు హిరిషణ్, అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు వెల్లువ



**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు నియోజకవర్గ ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన వారితో క్యాంపు కార్యాలయ పరిసరాలు కిటకిటలాడాయి. సనాతన హిందూ ఉత్సవ సమితి, సభ్యులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు, బీజేపి నాయకులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి



**జైనూర్, జనవరి 1 (ప్రభాత సమాచారం)** ఆదివాసుల ఆరాధ్యదైవం జంగో లింగో దీక్ష స్వీకరణతో ఆదివాసీలు ఆధ్యాత్మిక మార్గంలో నడవటం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంటు ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ అన్నారు. జైనూర్ మండలంలోని జంగాం జంగో లింగో పుణ్యక్షేత్రంలో భక్తులు జంగో లింగో దీక్షలను బుధవారం స్వీకరించారు. జంగో లింగో దీక్షతో రోజుల పాటు కఠోర నియమాలతో ఉన్నప్పుడు కుటుంబంలో శాంతి ఏర్పడటమే కాకుండా ఇబ్బందులు, కష్టాలు క్రమంగా దూరమవుతాయన్నారు. జంగో లింగో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

## పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)** విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. బుధవారం ఆదిలాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. అనంతరం తెలంగాణ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలన్నారు.

## 3న బహిరంగ విచారణ..


**ఆసిఫాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)** షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమీషన్ ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి డా. షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో 3వ తేదీన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ నిర్వహించడం జరుగుతుందని ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు.



## కేటీఆర్‌ను కలిసిన బోథ్ ఎమ్మెల్యే

**బోథ్ (ఆదిలాబాద్), జనవరి 1 (ప్రభాత సమాచారం)**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అంతకుముందు జిల్లాలో సమగ్ర శిక్షా ఉద్యోగులు, సీఆర్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత



**కుంటాల, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
నిరుపేదలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి. బుధవారం కుంటాల మండలంలోని పెంచికలపాడు గ్రామానికి చెందిన గంగమణి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన 60 వేల రూపాయల చెక్కును అందజేశారు. చెక్కు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## నేటి నుంచి పత్తి కొనుగోళ్లు నిలిపివేత



**బెల్లంపల్లి, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి వ్యవసాయం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పత్తి కొనుగోళ్లను గురువారం నుంచి తాత్కలికంగా నిలిపేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి నిలువలు పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో ఈ నెల 5 వరకు కొనుగోళ్లు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. 6 నుంచి కొనుగోళ్లు పున: ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు.

## డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ..

**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ 2025 క్యాలెండర్ ను ఫెడరేషన్ నాయకులు ఆవిష్కరించారు. బుధవారం పట్టణంలోని కొమురం భీం చౌక్ లో నాయకులు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యావ్యవస్థలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యను పరిష్కరించాలన్నారు. విద్యారంగానికి 30% బడ్జెట్ కేటాయించాలన్నారు. కార్యక్రమంలో డీ టీఎఫ్ నాయకులు సుధాకర్, వృకోధర్, సాయికాంత్, శ్రీనివాస్, నారాయణ్, కిషోర్ ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలి





**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా పాఠశాలలను బలోపేతం చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందడం వల్ల పేద విద్యార్థులకు లాభం చేకూరుతుందన్నారు. విద్యావకాశాలు మెరుగుపడడం ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కావున ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కె కిష్టన్న ప్రధాన కార్యదర్శి వి.అశోక్ ఉపాధ్యక్షులు టి. సూర్య కుమార్ కార్యదర్శులు ఎ.స్వామి, ఎ.ఇస్తారి, సి విలాస్, ఈ.శివన్న, కే.గణేష్, గౌస్ మొహియుద్దీన్, సోషల్ మీడియా కన్వీనర్ కె శంకర్, జిల్లా కమిటీ సభ్యులు, వివిధ మండలాల బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే..

పిఆర్టియుటీఎస్ సంఘం నాయకులు ఎమ్మెల్యే పాయల్ శంకర్ ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.నరసింహ స్వామి, జిల్లా గౌరవాధ్యక్షులు డి.గోవర్ధన్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా మండల బాధ్యులు పాల్గొన్నారు.

## 30 పోలీస్ యాక్ట్ అమలు



**ఆసిఫాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
శాంతిభద్రతల దృష్ట్యా జిల్లాలో జనవరి 31 వరకు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డీఎస్పీ లేదా ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి సమావేశాలు, ధర్నాలు, ఊరేగింపులు, సభలు నిర్వహించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిషేధంలో ఉన్న నిబంధనలను తప్పని సరిగా అందరూ పాటించాలని కోరారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాలని సూచించారు.

# నూతన ఆలోచనలతో ముందుకు..





- **కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రముఖులు**
- **ఆదిలాబాద్‌ను ముందు వరుసలో ఉంచుతాం : కలెక్టర్**

**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల అమలులో జిల్లాను ముందు వరుసలో ఉంచుతామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో 2025 సంవత్సర శుభాకాంక్షలను అధికారులు తెలియజేశారు. కలెక్టర్ సూచన మేరకు బుక్స్, బ్లాంకెట్స్ అందిస్తు నూతన సంవత్సరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కోటపరందోలిలో జనవరి రెండవ తేది నుంచి నిర్వహించే జంగుబాయి ఉత్సవాల పోస్టర్లను నిర్వహణ కమిటీ సభ్యులు సలాం శ్యాంరావ్, మరప బాజీరావు, కోడప జకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ఈ నూతన సంవత్సరంలో అందరికి మంచి జరగాలన్నారు. యువత మంచి దిశగా వెళ్లడంతో పాటు పిల్లలు భవిష్యత్తుపై దృష్టి సారించాలన్నారు. అలాగే 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. తన పిలుపు మేరకు అధికారులు, జిల్లా ప్రజలు సామాజిక బాధ్యతగా బుకేకు బదులుగా బుక్స్, బ్లాంకెట్స్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. అవసరమున్న వారికి ఇవి ఉపయోగపడుతాయన్నారు. సమాజంలో విద్య చాలా ముఖ్యమని అందుకే అవసరమున్న వారికి నోట్ బుక్స్, మహనీయుల జీవిత చరిత్రలు తెలియజేసే మంచి పుస్తకాలు మార్గదర్శనం చేయడానికి ఉపయోగపడుతాయన్నారు.

## పట్నాలు వేసి.. ఎల్లమ్మ తల్లికి బోనాలు

**మామడ, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
మండలంలోని కమల్ కోట్ గ్రామంలో బుధవారం ఎల్లమ్మ తల్లికి భక్తులు బోనాలు సమర్పించారు. బెల్లం పానకంతో ప్రత్యేకంగా తయారు చేసిన బోనాలను నెత్తిన ఎత్తుకొని బంతిపూలు మెడలో ధరించి, పోతరాజుల నాట్య విన్యాసాలు, డప్పు వాయిద్యాలతో ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. పూజారుల ఆధ్వర్యంలో పట్నాలు వేసి ప్రత్యేక మొక్కులు చెల్లించుకుని తమ కుటుంబాలు చల్లంగా చూడాలని ఎల్లమ్మ తల్లిని వేడుకున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

### ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు




**కాగజ్‌నగర్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు సర్‌సిల్క్‌కాలనిలోని తన కార్యాలయంలో టీఎస్ యూటీఎఫ్ 2025 డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించడంలో తమ వంతు బాధ్యతను నిర్వహించాలని, నిరంతరం విద్యాభివృద్ధి, సమాజాభివృద్ధికి పాటుపడాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి మాట్లాడుతూ అధ్యయనం, ఆధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో ప్రతి టిఎస్‌యుటిఎఫ్ ఉపాధ్యాయుడు విద్యాభివృద్ధికి, సమాజాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఎల్ ప్రీతి, జిల్లా కార్యదర్శి రాజకమలాకర్ రెడ్డి, మండల అధ్యక్షులు మహిపాల్, రంజిత్‌రాజ్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



## కేటీఆర్‌ను కలిసిన సాయిని ప్రసాద్

**జన్నారం, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కలవకుంట్ల తారక రామారావును బుధవారం జన్నారం మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన నేతగాని మహర్ విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసాద్ నేతకు పలు సూచనలు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాలని కోరారు. ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందన్నారు.


## అక్రమంగా తరలిస్తున్న 18కాటన్‌ల దేశీదారు స్వాధీనం



**ఆసిఫాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
మహారాష్ట్ర నుండి అక్రమంగా తరలిస్తున్న దేశీదారు మద్యాన్ని రెబ్బెన పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై చంద్ర శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా కాగజ్‌నగర్ వైపు నుండి కారులో అక్రమంగా తరలిస్తున్న 18 దేశీదారు మద్యం కాటన్‌లను పోలీసులు పట్టుకున్నారు. మార్కెట్లో దేశీదారు మద్యం బాటిల్స్ విలువ సుమారు రూ.61,200 విలువ ఉంటుందని పోలీసులు తెలిపారు. మద్యాన్ని తరలిస్తున్న కారును సీజ్ చేసి, కాగజ్‌నగర్‌కు చెందిన రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## అందరికీ మంచి జరగాలి..

**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
ఆంగ్ల సంవత్సరంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఎమ్మెల్యే పాయల శంకర్ ఆకాంక్షించారు. బుధవారం శాంతినగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి పుష్పగుచ్చాలు అందించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్టీయూ సంఘం నూతన క్యాలెండర్ తో పాటు డైయిరీని ఆవిష్కరించారు. అనంతరం ఆయా సంఘాల నూతన క్యాలెండర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ సాధనలో కీలకంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు ఈ సంవత్సరంలో పరిష్కారం కావాలన్నారు. సరస్వతి శిశుమందిర్‌లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ సనాతన హిందూ ఉత్సవ సమితి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి స్వీట్లు తినిపించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ ఖత్రి, గౌరవ అధ్యక్షుడు బండారి వామన్, ప్రధాన కార్యదర్శి మహాదవ్, రేణికుంట్ల రవీందర్, సుభాష్, టీఎన్జీవోస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, నవీన్, ఎస్టీయూ నాయకులు రవీరంద్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



# కలెక్టర్లకు నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ







**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
నూతన సంవత్సరంను పురస్కరించుకుని గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు బుధవారం కలెక్టర్ రాజర్షి షా ను ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు నోట్ బుక్స్ అందచేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ.. 2025 సంవత్సరములో నూతన ఉత్తేజంతో జిల్లా ప్రగతి కి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ రామారావు అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్స్ రాజేష్, వామన్, కోశాధికారి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీస్ అనిల్, నరేష్, మహిళా జాయింట్ సెక్రటరీ వినూత్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేష్, ఈసి మెంబర్ నరేష్ పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ కలెక్టర్‌ను కలిసిన ప్రజా సంఘాలు..**
**ఆసిఫాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
ప్రజా సంఘాల నాయకులు కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేని బుధవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో జిల్లాలో నెలకొన్నటువంటి సమస్యలు అంచలంచెలుగా పరిష్కరించి వెనకబడిన జిల్లాను ప్రగతిపథంలో నడపాలని కోరారు.

**నిర్మల్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన కేజీబీవీ విద్యార్థులు**
**నిర్మల్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కేజీబీవీ విద్యార్థినులతో కలిసి కలెక్టర్ అభిలాష అభినవ్ ఉదయం అల్పాహారాన్ని స్వీకరించి, విద్యార్థులతో ముచ్చటించారు.

## కిన్వట్ మాజీ ఎమ్మెల్యే ప్రదీప్ నాయక్ మృతి

**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా సరిహద్దు మహారాష్ట్రలోని కిన్వట్ మాజీ ఎమ్మెల్యే ప్రదీప్ నాయక్ బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి కిన్వాట్ తాలూకా దహేలి తండాలోని వారి నివాసానికి వెళ్లి ప్రదీప్ నాయక్ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.



## సెల్ఫీ విత్ సీఎం కార్యక్రమం చేపట్టిన ఉద్యోగులు



**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ బుధవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు వినూత్న నిరసన తెలిపారు. వందలాదిగా తరలి వచ్చిన ఉద్యోగులు ఎన్టీఆర్ చౌక్‌లో సెల్ఫీ విత్ సీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం ఫ్లెక్సీ వద్ద సెల్ఫీ దిగారు.. సీఎంకు ఎక్స్ ద్వారా సెల్ఫీ చిత్రాలను పంపించారు. ఉద్యమాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను విరమించి, ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపేలా స్పష్టమైన హామీ ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పదాల రవీందర్, జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు ధరమ్ సింగ్ పార్థసారథి ప్రశాంత్ రెడ్డి కేశవ్ దేవదర్శన్ వెంకటి నవీన మంగేష్ పాల్గొన్నారు.

## ఘనంగా బీమాకొరెగావ్ శౌర్య దివస్



**వాంకిడి, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
బీమాకొరెగావ్ శౌర్యదివస్‌ను బుధవారం మండలంలోని వివిధగ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకొ న్నారు. ఈసందర్భంగా జేత్‌వాన్ బుద్ధవిహార్‌లో అంబేద్కర్, గౌతమ బుద్ధుడి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1818జనవరి 1న బీమాకొరెగావ్ గ్రామంలో సమానత్వం, ఆత్మగౌరవం కోసం జరిగిన పోరాటంలో కేవలం 500 మంది మహర్ సైనికులు 28,000మంది పిష్వ సైన్యాన్ని ఓడించారని అన్నారు. ఈసంఘటనలో వీరమరణం పొందిన 22మంది భీమ్ సైనికులకు ఈసందర్భంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్, మండల నాయకులు జైరాం ఉప్రె, దుర్గం శ్యాంరావు, విలాస్, రాజేంద్రప్రసాద్, దుర్గం ప్రశాంత్, రోషన్, ప్రతాప్, పాండుజీ, రాజేశ్వర్, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.



### జంగు బాయి ఉత్సవాల పోస్టర్లను
## ఆవిష్కరించిన కలెక్టర్

**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కోటపరం దోలిలో ఈనెల 2 నుంచి ప్రారంభం కానున్న పవిత్ర పుష్యమాస జంగు బాయి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. బుధవారం జంగుబాయి ఉత్సవాల ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. అనంతరం ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్యాంరావ్ తదితరులున్నారు.

### ఫ్యాన్స్ క్యాలెండర్ ఆవిష్కరించిన
## నటుడు విజయ్ దేవరకొండ



**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
విజయ్ అండ్ ఆనంద్ దేవరకొండ అభిమానుల తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన 2025 క్యాలెండర్‌ను సినీ హీరో విజయ్ దేవరకొండ ఆవిష్కరించారు. హైదరాబాద్ లోని ఫిల్మ్ నగర్ వద్ద హీరో నివాసంలో ఆవరణలో ఫ్యాన్స్ తో కలిసి ఆవిష్కరణ చేశారు. ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గణేష్, రాష్ట్ర అధ్యక్షుడు లడ్డు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నాని ఉన్నారు.

## ప్రజాసేవ భవన్‌లో వేడుకలు

**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని ప్రజాసేవ భవన్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కంది శ్రీనివాస్ రెడ్డికి ప్రజలు, పార్టీ శ్రేణులునూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలు సంతోషంగా ఉండాలని ఆయనఆకాంక్షించారు.

# అడవి జంతువులను వేటాడం నేరం

**- కేసుల సత్వర పరిష్కారం సాక్ష్యాలను త్వరగా ప్రవేశపెట్టాలి**

**- జిల్లా జడ్జి ఎంవీ రమేష్**

**సిర్పూర్ (టి), జనవరి 1 (ప్రభాత సమాచారం)**

అటవీ కేసుల పరిష్కారం కోసం సిబ్బంది నిర్ణీత విధానాన్ని పాటించాలని జిల్లా జడ్జి ఎంవీ రమేష్ అన్నారు. కాగజ్‌నగర్‌లోని వేంపల్లి టింబర్ డిపో ఆవరణలో సిబ్బందితో అటవీకేసుల పరిష్కారానికి జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాటాడారు. అడవి జంతువులను వేటాడం నేరమన్నారు. ఇటు వంటి కేసుల సత్వర పరిష్కారం కోసం సిబ్బంది అవసరమైన సాక్ష్యాలను త్వరగా ప్రవేశపెట్టాలన్నారు. సమావేశంలో సినియర్ సివిల్ జడ్జి యువరాజు, జూనియర్ సివిల్‌జడ్జి అనంత లక్ష్మి, ఎఫ్‌డీవో, సిబ్బంది పాల్గొన్నారు.



# ఉన్నతాధికారుల ఆదేశాలు జిల్లాకు వర్తించవా..!?

**ముధోల్ నియోజకవర్గంలో కొనసాగుతున్న ఓ ఉపాధ్యాయ సంఘం నేత హవా**

**నిర్మల్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాకు రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు జారీ చేసిన వర్క్ అడ్జస్ట్మెంట్ ఆదేశాలు వర్తించవా...! అంటే అవుననే ... అనిపిస్తుంది. విద్యా సంవత్సరం ప్రారంభమై.. ముగింపునకు కావస్తున్నప్పటికీ నిబంధనల మేరకు వర్క్ అడ్జస్ట్మెంట్ చేయకుండా తాత్సారానికి కారణాలు తెలియరావడం లేదు. గతంలో జిల్లా విద్యాశాఖ అధికారిగా పని చేసిన రవీందర్ రెడ్డి విద్యా సంవత్సర ప్రారంభంలో కొన్ని రాతపూర్వక డిప్యూటేషన్లను జారీ చేశారు. మరో వర్క్ అడ్జస్ట్మెంట్ జాబితా విడుదల చేసే ముందు అనుకోకుండా ఆయన బదిలీ అయి మహబూబాబాద్ జిల్లాకు వెళ్లిపోవడం జరిగింది. అప్పటినుండి వర్క్ అడ్జస్ట్మెంట్‌ల విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే... అన్న చందాన కొనసాగుతుంది. కొత్తగా వచ్చిన జిల్లా విద్యాశాఖ అధికారి రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుల వర్క్ అడ్జస్ట్మెంట్ గైడ్ లైన్స్ ను బుట్ట దాఖలు చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి.డి ఈ ఓ పి. రామారావు రాతపూర్వక వర్క్ అడ్జస్ట్మెంట్ల జోలికి వెళ్లకుండా చాక చక్యంగా మౌఖిక ఉత్తర్వులతో అక్రమ డిప్యూటేషన్లకు తెర లేపారని అంటున్నారు. ఇందులో ముధోల్ నియోజకవర్గం లోని ఒక ప్రధాన ఉపాధ్యాయ సంఘం బడా నేత ఒత్తిడిల మేరకే ఈ అక్రమ వర్క్ అడ్జస్ట్మెంట్లు జరిగినట్లుగా తెలుస్తోంది. అంతేకాకుండా మౌఖిక డిప్యూటేషన్లను అదునుగా తలంచిన సదరు బడా నేత ఆయా మండలాల విద్యాధికారులపై ఒత్తిడి పెంచి, ఉపాధ్యాయులతో లాలూచీ పడి ఈ తంగాన్ని నెరపుతున్నట్లుగా ఆరోపణలు మిన్నంటు తున్నాయి. ఏకంగా నర్సాపూర్ (జి) మండలం నుండి 60 కిలోమీటర్ల దూరంలో బాసర మండల కేంద్రానికి ఒక ఉపాధ్యాయుని సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని డిప్యూటేషన్ జరిపించినట్లుగా సమాచారం .ఆ ఉపాధ్యాయుడి స్థిర నివాసమైన నిజామాబాద్ నుండి చక్కగా రాకపోకలు చేసుకునే విధంగా డిప్యూటేషన్ పేరుతో ఏర్పాట్లు చేశారు .అదేవిధంగా ముధోల్ మండల కేంద్రం నుండి ఇతర పాఠశాలకు మౌఖిక ఆదేశాలతో వర్క్ అడ్జస్ట్మెంట్ పేరుతో అక్రమానికి పాల్పడుతున్నారు. ఇదేవిధంగా ముధోల్ మండలం లోని మచ్కల్ ప్రాథమిక పాఠశాలలో యు డైస్ ప్రకారం కేవలం 7గురు విద్యార్థులు ఉన్నప్పటికీ, ఇటీవల జరిగిన ఉపాధ్యాయ నియామకాల్లో మరో ఉపాధ్యాయున్ని అక్కడ నియమించి ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కారు. ఈ విధంగా నియమించుటలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఇలాంటి అక్రమాలు కోకొల్లలుగా జరగుతున్నప్పటికి ఇక్కడ మచ్చుకకు మాత్రమే ఇక్కడ ఈ రెండు చూపించడం జరుగుతోంది. ఇలాంటి అక్రమ మౌఖిక వర్క్ అడ్జస్ట్మెంట్లు మరెన్నో జిల్లాలో కొనసాగుతున్నాయి . ఇలాంటి అక్రమ మౌఖిక డిప్యూటేషన్లు ఎందుకు, ఎవరి శ్రేయస్సు కోరి చేస్తున్నారో విశదీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తమ లాభం కోసం వర్క్ అడ్జస్ట్మెంట్ కోరుకునేవారు ఆ బడా సంఘ నేతకు కొంత ముట్ట చెప్పుకొని కార్యక్రమాలను చక్క పెట్టుకుంటున్నట్లు సమాచారం. జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విచారణ జరిపించి అక్రమార్కులపై కొరడా ఝుళిపించాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

# నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

**జన్నారం, జనవరి 1 (ప్రభాత సమాచారం)**

ఆలయ ఫౌండేషన్, జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని పౌండేషన్ సభ్యులు బుధవారం తెలిపారు. వెల్డింగ్, ఆటోమొబైల్, ఎక్స్కావేటర్ ఆపరేటర్ తదితర వాటిలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. రెండు నెలల ట్రైనింగ్, ఒక నెల ఆన్ టైం జాబ్ ఉంటుందని తెలిపారు. ఈనెల 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

# బుద్ధ విహార్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా విజయ్ దివస్




**నిర్మల్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ బుద్ధ విహార్ కమిటీ ఆధ్వర్యంలో 'విజయ్ దివస్'ను ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భమున 'భీమకోరేగావ్'యుద్ధంలో అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించి కుల అహంకార పీష్వా సైన్యాలను ఓడించిన మహార్ సైనికులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బుద్ధ విహార్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కుంటోల్ల వేంకట స్వామి,మధుకర్ మునేశ్వర్, సభ్యులు మురళీ, క్రాంతికిరణ్, సంజీవ్, భగత్ నారాయణ, మధు, భీమన్న, గంగన్న, నరేష్, పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన వారికి అండగా ఉంటాం

**మంచిర్యాల, జనవరి 1 (ప్రభాత సమాచారం)**

పోలీస్ శాఖలో ఉద్యోగ విరమణ పొందిన వారికి అండగా ఉంటామని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. కమిషనరేట్ పరిధిలోని పలువురు అధికారులు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా కమిషనరేట్ ఆవరణలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం సీపీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో సుధీర్గా కాలం పాటు విధులు నిర్వహించి పోలీస్ శాఖకు ప్రజలకు అందించిన సేవలను ఆయన కొనియాడారు. కుటుంబ సభ్యులతో శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని సూచించారు.



# జోగురామన్నను కలిసిన సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు

**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**

హిందూ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు తెలియజేస్తూ సనాతన హిందూఉత్సవ సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని మాజీ మంత్రి జోగురామన్న పేర్కొన్నారు. హిందూ ఉత్సవ సమితి సభ్యులు జోగురామన్నను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉత్సవ సమితి చేపట్టే కార్యక్రమాలకు అండగ ఉండాలని అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ కోరారు.



# ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు

**నిర్మల్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సరం వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ హైదర్, అబ్దుల్ సాధిఖ్, జహీర్, వినోద్ పాల్గొన్నారు.






# ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

**ఆసిఫాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**

నూత న సంవత్సరాన్ని పురస్కరించుకొని కొత్త ఆలోచ నలతో 2025 ఏడాది మొత్తం సకల శుభాలు కల గాలని ఆకాంక్షిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచేకాక ఇతర ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో బుధవారం ఆలయాలు రద్దీగా మారాయి. ముందుగా స్వామి వారి ఆలయంలో గణపతి పూజ, స్పర్శ దర్శనం, అభిషేకం అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన వంటి విశేష పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి చీర, గాజులు, త్రిశతి ఖడ్గమాల, ఒడిబియ్యం సమ ర్పించి మొక్కులు చెల్లించారు. జిల్లా కేంద్రంతోపాటు మండలంలో 2025 నూతనసంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల తరువాత కొత్తసంవత్సరానికి స్వాగతం పలుకుతూ అన్ని వర్గాల ప్రజలు ఆనందోత్సాహాల మధ్యవేడుకలను నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. కలెక్టర్ వెంకటేష్ దోత్రే కుటుంబ సభ్యులతో కలిసి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్‌ను కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లా మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలో యువకులు డ్యాన్సులు చేశారు. కేక్‌కట్ చేసి సంబరాలు జరిపారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోస్తు నిర్వహించారు. ఆయా మండలాల్లో మంగళవారం అర్ధరాత్రి 12గంటలు దాటాక యువకులు కేక్‌లు కట్‌చేసి టపాసులు పేల్చి నూతనసంవత్సర సంబరాలు జరుపుకున్నారు. శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు బుధ వారం ఇళ్లముందు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ముగ్గులు వేశారు.



## ఉన్నత స్థానానికి ఎదగాలి

**ఉట్నూర్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
చదువులో రాణించి ఉన్నతంగా ఎదగాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బోజ్జు పటేల్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని చాందూరి గ్రామానికి చెందిన కురిసెంగ శివాజీ అనే గిరిజన అంద విద్యార్థి చదువులో రాణించేందుకు ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తాని కలిసి విన్నవించారు. దాంతో స్పందించిన పీఓ విద్యార్థి మొబైల్ ట్యాబ్ ను మంజూరు చేయగా ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థికి దానిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుకు వైకల్యం అడ్డు రాదన్నారు. చదువుపై ఉన్న దృఢ సంకల్పం జీవితంలో ఉన్నతమైన స్థానంలో ఉంచుతుందన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా తనని కలిసి విన్నవించవచ్చని సూచించారు. కాగా న్యూ ఇయర్ సందర్భంగా కార్యకర్తలు, అధికారులు విసెస్ చెప్పేందుకు ఎమ్మెల్యే వద్దకు తరలి వచ్చారు. పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, దుప్పట్లను ఎమ్మెల్యేకు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఖానాపూర్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, కడం, పెంబి మండలాల్లోని పలు గ్రామాల్లో ఉదయం 9 గం టల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా 33/11 కేవీ ఎస్ ఎస్, సత్తెనపల్లి, బీర్ నం ది, పాత ఎల్లాపూర్, లింగాపూర్, పెంబి సబ్స్టేషన్ల పరిధిలోను గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుంది అని ఖానాపూర్, కడం విద్యుత్ అధికారి ఎం.రాం సింగ్ ఒక ప్రకటనలో తెలుపరు. నెలవారి మరమ్మతుల కారణంగా 33కెవి పెంబీ ఫీడర్ పైన చెట్ల కొమ్మలను తొలగించుటకు విద్యుత్ లైన్లో ఉన్న మరమ్మతు లను సరి చేయుట కొరకు నేడు ఉదయం 9 గంటల నుంచి రెండు గంటల వరకు దిగువ తెలుపబడిన గ్రా మాలకు అనగా సత్తె నపల్లి, పాత ఎల్లాపూర్ గోసంపల్లి, దిలవార్ పూర్, గోడాల పంపు, బీరనంది, ఎర్ర చింతల్ కొల్లం గూడ, ఇప్పమాడ, పెంబి, లింగాపూర్, న ర్సాపూర్ మరియు ఇతర గ్రామాలకు విద్యుత్ అంత రాయం ఉంటుంది. కావున విద్యుత్ వినోదారులందరూ మా విద్యుత్ శాఖకు సహకరించగలరని కోరారు.

## బీమా కోరేగావ్ విజయ దివస్ వేడుకలు

**బెల్లంపల్లి, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
దళితుల ఆత్మగౌరవ ప్రతీక భీమా కోరే గావ్ దివాస్ వేడుకలు బుధవారం మంచిర్యాల జిల్లా బెల్లం ఎపల్లిలో దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహిం చారు. భీమా కోరేగావ్ విజయ్ దివాస్ ను పురస్కరించు కొని అంబేద్కర్ చౌరస్తా వద్ద భీమా కోరేగావ్ యుద్ధంలో అసువులు బాసిన వీరులను స్మరించుకుంటూ స్తూపనికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు చిలుక రాజనర్సు మాట్లాడారు. దేశ చరిత్రలో భీమా కోరేగావ్ యుద్దానికి ప్రత్యేక స్థానం ఉం దన్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీపై తిరుగుబాటు చేసిన మరాఠా పీష్వా సైన్యం సాధించిన విజయం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

- ఉమ్మడి జిల్లాలో ఒక్క రోజులోనే రూ.20కోట్లకు పైగా మద్యం విక్రయాలు
- మూడింతలు పెరిగిన విక్రయాలు
- చికెన్, మటన్‌ది అదే దారి..
- కొత్త సంవత్సర వేడుకల్లో కొత్త రికార్డు
- ఉమ్మడి జిల్లాలో ఆబ్కారీ ఖజానాకు కాసులు కురిపించిన డిసెంబర్ 31
- 10 రోజుల లెక్కలు తీస్తే పెరిగే ఛాన్స్
- గతేడాది కంటే పెరిగిన విక్రయాలు




**ఆదిలాబాద్ ప్రతినిధి, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
కొత్త సంవత్సర ఆహ్వాన వేళ.... ఆబ్కారీ శాఖ పంట పండింది. గత ఏడాదితో పోలిస్తే 40% పైగా మద్యం అమ్మకాలు పెరిగాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో డిసెంబర్ 31 ఉదయం మొదలు... 2025 కొత్త సంవత్సరం జనవరి ఒకటో తేదీ ఎంట్రీ అయ్యే సమయానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. 20 కోట్ల మద్యం తాగేశారు. ఆదిలాబాద్ జిల్లాలో మూడు కోట్ల 20 లక్షలు, నిర్మల్ జిల్లాలో మూడు కోట్ల ఆరు లక్షలు, మంచిర్యాల జిల్లాలో ఏడు కోట్ల మూడు లక్షలు, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రెండు కోట్ల ఐదు లక్షల చొప్పున మద్యం అమ్మకాలు నమోదయ్యాయి. అయితే సింగరేణి సహా కార్మికులు భారీ మొత్తంలో ఉండే మంచిర్యాల ఒక్క జిల్లాలోని ఏడు కోట్లకుపైగా మద్యం అమ్మకాలు జరగడం ఆసక్తిగా కనిపిస్తున్నది. గత ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 కోట్ల మద్యం అమ్మకాలు జరగగా... ఈ ఏడాది సుమారు 20 కోట్ల్ల మద్యం అమ్మకాలు జరగడం ఎక్సైజ్ శాఖ అధికారుల్లో సంతోషాన్ని నింపింది. డిసెంబర్ 31 నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మద్యంతో పాటు మాంసం విక్రయాలు ఊపందుకున్నాయి. జిల్లా కేంద్రం, కాగజ్‌నగర్ మున్సిపాలిటీతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో ఇయర్ ఎండింగ్ వేడుకలు జోరుగా సాగాయి. ఆటాపాటలతో జనం ఉత్సాహంగా వేడుక చేసుకున్నారు. హెూటళ్లు, బార్లతో పాటు ప్రత్యేక పర్యాటక ప్రాంతాల్లో సంబురాలు జరుపుకొన్నారు. భారీ స్థాయిలో చికెన్, మటన్, చేపల విక్రయాలు సాగాయి. ప్రధానంగా ఈ ఏడాది చివరిరోజు మంగళవారం రావడంతో అన్ని వర్గాల ప్రజలు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యాటక ప్రాంతాలతో పాటు నివాస ప్రాంతాల్లో యువత, మహిళలూ వేడుకలు జరుపుకొన్నారు. ఈ ఏడాది ఇయర్ ఎండింగ్ వేడుకల్లో జిల్లాలో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికిన సందర్భంగా డిసెంబర్ 31న మద్యం ఏరులై పారింది. మామూలు రోజులతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే రూ.93 లక్షలు అధికంగా మద్యం అమ్ముడు పోయింది. మద్యంతో పాటు మాంసం విక్రయాలూ అదే స్థాయిలో ఉన్నాయి. ఏటా ఇయర్ ఎండింగ్ వేడుకల్లో భాగంగా డిసెంబర్ 31న జిల్లాలో భారీగా మద్యం విక్రయాలు జరుగుతుండగా, ఈ సారీ అదే స్థాయిలో విక్రయాలు కొనసాగాయి. ప్రభుత్వం మద్యం దుకాణాలకు అర్ధరాత్రి 12 గంటల వరకు అనుమతిచ్చింది. డిసెంబర్ 31 ఉదయం నుంచి హెూటళ్లు, బార్లు తెరుచుకోవడంతో యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు పార్టీలు చేసుకునేందుకు ఉత్సాహం కనబరిచారు. ఈ క్రమంలో జిల్లాలోని 32 మద్యం దుకాణాల్లో డిసెంబర్ చివరి మూడురోజుల్లో రూ.5 కోట్ల 5లక్షల 71 వేల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు వెల్లడించారు. గతేడాది రూ.4కోట్ల 12లక్షల 3వేల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ. 93.67 లక్షల మద్యం అధికంగా అమ్ముడుపోయింది. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. ఈ ఏడాది డిసెంబర్ చివరి మూడురోజుల్లో జిల్లాలో 5,634 ఐఎంఎల్ లిక్కర్, 6,005 బీర్ల అమ్మకాలు జరిగాయి. ఇయర్ ఎండింగ్ సందర్భంగా మూడురోజుల పాటు భారీగా మద్యం అమ్ముడుపోయింది. మొత్తానికి డిసెంబర్ 31 నూతన సంవత్సరం వేడుకలు ఉమ్మడి జిల్లాలో ఆబ్కారీ శాఖకు కాసుల వర్షం కురిపించింది.

## బాసర ఆలయంలో భక్తుల కోలాహలం





**బాసర, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకుంది. నూతన సంవత్సరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుండి భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానలు ఆచరించి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కొత్త సంవత్సరం అంతా మంచే జరగాలని కోరుతూ తమ చిన్నారులకు ఆలస్యన్నిధిలోని మండపాలలో అక్షరాబ్యాస పూజలు జరిపించారు. సరస్వతి, మహాలక్ష్మి మహాకాళి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

**అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యేల పూజలు**
బాసర అమ్మవారి సన్నిధిలో బుధవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అమ్మ వార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న వీరిని ఆలా అధికారులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక కుంకుమార్చన పూజలు జరిపించి హారతినిచ్చి ఆశీర్వదించారు. ఆశీర్వచనమండపంలో వీరికి శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్థానిక శ్రీ జ్ఞాన సరస్వతి ఆర్యవైశ్య భవన్‌ను ఎమ్మెల్యేలు ప్రారంభించారు.

## కోరికలు తీర్చే వంగెపురి భీమయ్యక్, రాజుల్ దేవతలు



**ఆసిఫాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
అడవితో పాటు సూర్యచంద్రులు, నీరు, నిప్పును పూజించే స్వభావం కొలాం ఆదివాసీలది. వీరు భీము దేవున్ని కొలుస్తారు. తమ సంస్కృతిని కాపాడుతున్న కొలాం ఆదివాసీలు నేడు, రేపు ఇష్ట దేవతలకు మొక్కు తీర్చుకోనున్నారు. మండలంలోని జోడేఘట్ పంచాయతీ పరిధి పాట్నాపూర్ గ్రామంలో కొలువైన ఓంరాజ్ వంగెపురి భీమయ్యక్ స్వామి, రాజుల్ దేవతలకు మూడురోజులు ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. ఆ గ్రామంలో కొలువై ఉన్న ఈ దేవతలను ఒక్కరోజు ముందే గ్రామంలోకి తీసుకువచ్చారు. సమీప గ్రామాలతోపాటు ఇంద్రవెల్లి ఉట్నూర్, ఆదిలాబాద్, కెరమెరి, వాంకిడి, దండేపల్లి, లింగాపూర్, సిర్పూర్(యు)(టి), ఇచ్చోడ మండలాల్లోని అనేక గ్రామాలతో పాటు మహారాష్ట్రకు చెందిన వందలాది భక్తులు ఇక్కడికి వచ్చి మొక్కు తీర్చుకుంటారు.

### నేటి నుంచి ప్రత్యేక పూజలు

గురువారం నుంచి నుంచి ఈ నెల 4వ తేదీ వరకు ఇష్ట దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నిర్వహించే కొత్త కోడళ్ల బేటింగ్ ఎంతో ఉత్సాహంగా సాగుతుంది. వంగెపురి భీమయ్యక్, రాజుల్ దేవతలకు సమష్టిగా పూజల చేస్తారు. అనంతరం పెద్దల ఆశీర్వాదం స్వీకరిస్తారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు.

## రహదారి భద్రత తప్పనిసరి

**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
ఆర్టీసీ డ్రైవర్లు రహదారి భద్రత నియమాలను తప్పకుండా పాటించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. ఆదిలాబాద్ డిపోలో బుధవారం ఏర్పాటు చేసిన జాతీయ రహదారి భద్రత మానో త్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాల సంఖ్య తగ్గుతుందన్నారు. డ్రైవర్లు వాహనాన్ని నడుపుతున్నప్పుడు అప్రమత్తంగా వ్యవహరించా లన్నారు. అనంతరం డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు.డిప్యూటీఆర్ఎం ప్రవీణ్, ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన తదితరులు ఉన్నారు.

## ఖోఖో సీఎం కప్ మహిళల విజేత ఆసిఫాబాద్

**ఆసిఫాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో భాగంగా వరంగల్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన మహిళల విభాగంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా మొదటి స్థానం, నల్లగొండ జిల్లా ద్వితీయ, హైదరాబాద్ జిల్లా తృతీయ, రంగారెడ్డి జిల్లా జట్టు స్థానాలను కై వసం చేసుకున్నట్లు డీవైఎస్వో సత్యవాణి తెలిపారు. అలాగే పురుషుల విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు మొదటి స్థానం, మే డ్చల్ మల్కాజిగిరి జిల్లా రెండో స్థానం, ఆది లాబాద్ జిల్లా మూడో స్థానం, నిర్మల్ జిల్లా జట్టు నాలుగో స్థానం పొందారని పేర్కొన్నారు. విజేతలను అధికారులు అభినందించారు.

## సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె

**ఆదిలాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
కూలి రేట్ల ఒప్పంద జీవో వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేస్తూ సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు సమ్మెకు దిగారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో గల ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్ ఎదుట చేపట్టిన సమ్మెను ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ కార్మికులకు పూల మాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో సివిల్ సప్లయి హమాలీలతో రాష్ట్ర కమిషనర్ ఒప్పుకున్న రెట్ల ఒప్పంద జీవో వెంటనే విడుదల చేసి 01.01.2024 నుంచి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి జంగుల రాజు తదితరులు పాల్గొన్నారు.





# దీపమే.. దైవం!

## శార్ధుల వాహిని జంగుబాయి..!



(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

అడవుల జిల్లా గుండా వెళ్లే సహ్యాద్రి పర్వతాలు సుందర దృశ్యాలు.. కమనీయ జలపాతాలు నిగూఢమైన గుహలకు నిలయాలు..ఈ పర్వత శ్రేణులు అద్భుత ప్రపంచాలు. గోండు గిరిజనులకు ఇష్టమైన జంగుబాయి లోయ ఈ పర్వత శ్రేణుల్లోనే ఉంది. జంగుబాయి దుర్గామాత ప్రతిరూపమేనని గోండు ఆదివాసులు నమ్ముతారు. అందుకే వారు ప్రతి సంవత్సరం పుశ్యమాసంలో నెల రోజుల పాటు ఆమెను ఎంతో నిష్టతతో కొలుస్తారు. అదే సమయంలో అక్కడ నెల రోజులపాటు జాతర జరుగుతుంది. పొరుగులో ఉన్న మహారాష్ట్రలోని చంద్రపూర్ గడిచిరోలి, యావత్ మాల్ జిల్లాలతో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో ఆదివాసులు రావడంతో దట్టమైన కొండల నడుమ సాగే జాతర ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది...అడవి బిడ్డల నృత్య గానాల కోలాహలం తో ఆ ప్రాంతమంతా మారు మోగుతుంది. ఉట్నూర్ డివిజన్ లోని నార్నూర్ మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరం గల జంగు బాయి లోయ తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దులో ఉంది. జాతర సమయంలో మహారాష్ట్ర ప్రభుత్వం సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తుంది. ఉట్నూర్ వైపు నుంచి వెళ్లే ఆదివాసులు నార్నూర్ బీంపూర్ కొత్తపల్లి పదందోలిమీదుగా ఎడ్లబండ్లపై కాలి నడకన చెప్పులు లేకుండా ప్రయాణం సాగిస్తారు.దారిలో ఒక రాత్రి బస చేస్తారు. తిరిగి ప్రయాణం సాగించి జంగుబాయిలోద్ధిలో గల వాగులో స్నానం చేస్తారు.పూజా సామాగ్రి సిద్ధం చేసుకుని భూమిని నీళ్లతో పవిత్రం చేసి వంటలు వండుతారు. భోజనాలు ముగించుకొని నడక ప్రారంభిస్తారు. దారిలో గుర్రం ఆకారం లో ఉన్న దేవతలకు పూజలు చేస్తారు. ఆ తర్వాత ఆ తర్వాత కొంచెం ముందుకు వెళ్లిన తర్వాత ముందుకు వెళ్లి ఒక చింత చెట్టు కింద విడిది చేసి తిరిగి ఉదయం జంగుబాయి వద్దకు చేరుకొని ముందు సాష్టాంగ నమస్కారం చేసి గుహలోకి వెళ్తారు కాగడాలా వెలుగులో ఇరుకుగా ఉన్న గుహలోకి పాకుతూ వెళ్లి తొలుత శివలింగానికి తదుపరి నానుపు రాళ్లు ఆకారంలో గల జంగుబాయి దేవతకు నైవేద్యం సమర్పిస్తారు. గుహ లోకి ఏకకాలంలో ఒకరి కంటే ఎక్కువ మంది వెళ్లలేరు కాబట్టి ఒకరి తరువాత మరొకరు వెళ్లి మొక్కులు చెల్లించి వస్తారు.ఆ గుహలోకి ఐదు పొడవైన మార్గాలు నాలుగు చిన్న మార్గాలు ఉన్నాయి.వాటిలో ఏది ఎక్కడికి పోతుందో అంతు చిక్కదు. కాబట్టి జంగు బాయి ఉన్న మార్గంలోకి వెళ్తారు.పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకొని ఆరోజు రాత్రి అక్కడే నిద్రపోతారు. ఒక్క రాత్రి నిద్రపోవడం ఆచారం.కొండల మధ్య గుహలముందు పడుకున్నప్పటికీ క్రూర జంతువులేవి వారి దరిదాపులోకి రావు. మర్నాడు ఉదయం లేవగానే స్నానాలు ముగించుకుని నృత్యాలు భజనలు చేస్తారు. స్త్రీలు కూడా పాల్గొంటారు. నృత్యాలు కాగానే భోజనాలు ముగించుకొని ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి ప్రసాదం పూజ సామాగ్రి గంపలు నేత్తిన పెట్టుకొని తిరుగు ప్రయాణం ప్రారంభిస్తారు. దారిలో ఏ గ్రామం కనిపించినా వాయిద్యాలు మొగిస్తారు. గ్రామస్తులు వారికి ఎదురేగి స్వాగతం పలుకుతారు. పూజా సామగ్రితో ఉన్నవారు తమ గ్రామం చేరిన తర్వాత సూర్య నమస్కారం చేసి గ్రామస్తులకు తమ శక్తినానుసారం భోజనం పెడతారు జంగు భాయి అనుగ్రహం పొందుతేనే తాము సురక్షితంగా ఉండగలుగుతామని గోండుల నమ్మకం.






### దర్శించుకోవాలంటే ఇలా వెళ్లాలి..

**ఆసిఫాబాద్ నుంచి వెళ్లే భక్తులు కెరమెరి మండల కేంద్రం మీదుగా దేవాపూర్, అనార్ పల్లి, కొండి బాగుడా, మలంగి, మాలేపూర్ నుంచి ఉమ్రి క్రాస్ రోడ్ మీదుగా పరందోళి, మహరాజ్ గూడ చేరుకుని, అక్కడ్నుంచి 2 కిలోమీటర్లు పోతే అమ్మవారి ఆలయం వస్తుంది. ఆదిలాబాద్ నుంచి వచ్చే భక్తులు ఉట్నూరు, నాన్నూర్, లోకారి మీదుగా ఉమ్రి క్రాస్ రోడ్ నుంచి చేరుకోవచ్చు. ఆదిలాబాద్ నుంచి డైరెక్ట్‌గా నాన్నూర్, కొత్తపల్లి, మాలేపూర్ మీదుగా ఉమ్రి క్రాస్ రోడ్ నుంచి పరందోళి, మహరాజ్‌గూడ వెళ్లొచ్చు.**

### గుహలో కొలువైన అమ్మవారు..

తెలంగాణ –మహారాష్ట్ర సరిహద్దులోని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం మహరాజ్ గూడ సమీపంలోని సహ్యాద్రి పర్వతాల్లోని గుహలో సహజసిద్ధంగా కొలువైన జంగుబాయి అమ్మవారిని ఆదివాసీలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తుంటారు. వేల ఏండ్ల చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రంలో ప్రతి ఏటా జాతరను నిర్వహిస్తుంటారు. మన రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్ గడ్ తదితర రాష్ట్రాల నుంచి ఆదివాసీలైన గొండులు, పర్ధాన్, కోలాం తెగలకు చెందిన ప్రజలు దర్శించుకుంటారు. పుణ్యక్షేత్రంలో 8 గోత్రాల కటోడాలు(పూజారులు) సంప్రదాయం ప్రకారం కఠిన నియమాలతో జాతర పూర్తయ్యే దాకా భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు.

### దీపోత్సవంతో జాతర షురూ..

ఎనిమిది గోత్రాల కటోడాల ఆధ్వర్యంలో ముందుగా దీపోత్సవంతో ప్రారంభిస్తారు. తుమ్రం, కొడప, సలాం, రాయిసిడాం,హెర్రె కుమ్ర, మరప, వెట్టి, మందడి.. ఇలా ఎనిమిది గోత్రాల కటోడాలు తొలిరోజు కాలినడకన పూజా సామగ్రి తీసుకెళ్లి అదే రోజు రాత్రి దీపారాధన చేసి ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని సమర్పిస్తారు. ఇలా జాతర ముగిసే వరకు పూజలు కొనసాగిస్తుంటారు. జాతర జరిగే రోజుల్లో ఆదివాసీలు ఉదయం తమ ఇండ్ల ముందు ఆవుపేడతో అలుకు చల్లుతారు. ఇంటి ఆవరణలోకి చెప్పులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. చెప్పులు కూడా వేసుకోరు. నేలపైనే పడుకుంటారు. మద్యం అసలే ముట్టుకోరు. కనీసం హోటల్లో నీటిని కూడా ముట్టుకోరు. ఇంటి నుంచి కాలినడకన ఆలయానికి చేరుకుం టారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు మధ్యలో బస చేయాల్సి వస్తే గంపను నేలపై ఉంచ కుండా మూడు బండలను పేర్చి గో మూత్రంతో శుభ్రం చేసిన తర్వాత రాళ్లపై పెడతారు. జాతరకు వెళ్తూ మధ్యలో పుణ్యస్నానాలు చేసి ఆలయానికి చేరుకుంటారు.

### నైవేద్యం, పూజలు ఇలా..

ఆదివాసీ రైతులు పండించిన వడ్లను దంచి బియ్యం సేకరిస్తారు. గోధుమ పిండి, పప్పు, బెల్లంతో పాటు నువ్వుల నూనెతో నైవేద్యం వండుతారు. దీపారాధనకు నువ్వుల నూనె, నెయ్యి ,ఆముదం వినియోగిస్తారు. గంపలో కొబ్బరికాయ, ఆగరవర్తులు, చంద్రం, గుగ్గిలం, కుంకుమ, గులాలు, వంట సామగ్రి పెట్టుకుని సంప్రదాయ వాయిద్యాలతో తరలివెళ్తారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం మైసమ్మ, పోచమ్మ, రావుడ్క్ వద్ద మేకలు, కోళ్లు బలిచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. రాత్రి వంటలు చేసుకుని భోజనాలు చేసి పాటలు పాడుతూ అమ్మవారిని ఆరాధిస్తుంటారు. జాతర పూర్తయిన తర్వాత తిరుగు ప్రయాణంలోనూ ఆచారాలను పాటిస్తారు. 8 గోత్రాల పూజారులను కలుస్తారు. గంపను నెత్తిపై పెట్టుకుని ఇంటిదారి పడతారు.

### నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం..

జంగు బాయి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభమవుతాయి.జంగు బాయిగుహ వద్ద ఏర్పాట్లు పూర్తి చేసారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అధికారులను ఆదేశించారు. నెలరోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. వేలాది మంది ఆదివాసీలు వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తారు. నెల రోజుల పాటు జాతర సాగుతుంది.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల

# పరిష్కారం హుళక్కేనా..?

- సమస్యలు రాకుండా ప్రత్యామ్నాయాలతో కేజీబీవీలను చక్క బెట్టాలంటున్న ప్రభుత్వం
- జెట్ స్పీడ్‌తో విద్యాశాఖ అధికారుల పర్యటనలు
- మరోవైపు సమ్మెలో ఉన్న సమగ్ర ఉద్యోగులకు ప్రభుత్వం బుజ్జగింపులు, బెదిరింపులు



**నిర్మల్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
ఇచ్చిన హామీలను మరచిన ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులు కొనసాగిస్తున్న సమ్మెను శతవిధాల బ్రేక్ చేయడానికి ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లుగా తెలుస్తోంది.ఒక వైపు జిల్లా విద్యాశాఖ అధికారుల నుండి బుజ్జగింపుల పర్వానికి తెరలేపింది అదే సమయంలో టర్మినేట్ చేస్తామంటూ బెదిరింపులను కూడా కొనసాగిస్తున్నట్లుగా సమాచారం. ఒక వైపు కేజీబీవీ పాఠశాలలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వెంటనే చేసి విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు హుకుం జారీ చేసింది .గంపెడాశతో సాగుతున్న సమగ్ర ఉద్యోగుల సమ్మె బుధవారంతో 23 రోజులకు చేరుకుంది. ఈ క్రమంలో నిర్మల్ జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆదేశాల కనుగుణంగా జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు, జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు సిద్ధ పద్మ, సలోమి కరుణలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. దీంతో సమగ్ర ఉద్యోగుల సమస్యల పరిష్కారం వైపు చొరవ చూపకుండా వారి సమస్యలను కోల్డ్ స్టోరేజ్‌లో వేసినట్లుగానే భావించాల్సి వస్తుంది. వారం రోజులుగా జిల్లా విద్యాశాఖ అధికారులు జెట్ స్పీడుతో కేజీబీవీల వైపు పర్యటనలు చేస్తూ హడలెత్తిస్తున్నారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత మండల విద్యాధికారులకు, ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. అంతేకాకుండా ఎక్కడైనా లోటు పాట్లు ఉన్నట్లయితే సంబంధిత అధికారులపై కఠిన వైఖరి అవలంబిస్తున్నారు. అవసరమైతే షోకాజ్ నోటీసులు ఇచ్చి అధికారులను లైన్‌లో పెడుతున్నారు. విద్యార్థుల చదువుకు ఆటంకాలు ఏర్పకుండా అధిగమించాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా వారికి సమయానికి పుష్టికరమైన భోజనాన్ని అందించాలని కోరుతున్నారు. అవసరమైతే విద్యార్థినిలకు రక్షణగా మహిళా పోలీసులను ఏర్పాటు చేసుకోవాలని తెలుపుతున్నారు. ఈ క్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు మారుమూల మండలమైన పెంబి కేజీబీవీ,





ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ కేజీబీవీ పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అవసరమైన సలహా సూచనలను జారీ చేస్తున్నారు. అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. కానైతే సమగ్ర ఉద్యోగుల నిరవధిక సమ్మె కొనసాగింపులో ఎలాంటి మినహాయింపు ఉండదని నిర్మల్ జిల్లా సమగ్ర ఉద్యోగుల సంఘం నాయకులు 'ప్రభాత సమాచారం,తో మాట్లాడుతూ స్పష్టం చేశారు.



---

## నిర్మల్ జిల్లా ఏఎస్పీగా బాధ్యతలు

# స్వీకరించిన రాజేష్ మీనా

**నిర్మల్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ సబ్ డివిజన్ ఏఎస్పీగా నూతనంగా నియమితులైన రాజేష్ మీనా బుధవారం సబ్ డివిజన్ ఏఎస్పీగా భాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ జానకి షర్మిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిర్మల్ సబ్ డివిజన్ సమస్యలపై చర్చించారు. కాగా రాజేశ్ మీనా రాజస్థాన్ రాష్ట్రానికి చెందినవారు. ఐఐటీ జోద్‌పూర్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 2022లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు.



## ఆసిఫాబాద్ ఏఎస్పీగా బాధ్యతలు

# స్వీకరించిన చిత్తరంజన్

**ఆసిఫాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
ఏఎస్పీగా ఎస్.చిత్తరంజన్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏఎస్పీ పనిచేసిన ప్రభాకర్ రావు బదిలీ వెళ్లగా ఆయన స్థానంలో చిత్తరంజన్‌ను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తన చాంబర్‌లో పదవి బాధ్యతలు స్వీకరించిన నంతరం జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిక్షణకు, ప్రజల రక్షణకు కృషి చేస్తానని అన్నారు. ప్రజలు పోలీసుకు సహకరించాలన్నారు.

# ఎట్టకేలకు అటవీ శాఖ అధికారులకు చిక్కిన పులి



**ఆసిఫాబాద్, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
గత కొద్ది రోజులుగా తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో సంచరిస్తూ జిల్లా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న పులిని ఎట్టకేలకు బుధవారం మహారాష్ట్ర, చంద్రపూర్ అటవీ అధికారులకు చిక్కింది. అటవీ ప్రాంతాల్లో తిరుగుతున్న పెద్దపులి జిల్లాలోని సరిహద్దు గ్రామాల్లోని రహదారి వెంటనే తరుచూ తిరుగుతుండడంతో వేటగాళ్ల దృష్టి పడే ప్రమాదం ఉందని, దాదాపు వారం రోజుల పాటు అధికారులు శ్రమించి చాకచక్యంగా వ్యవహరించి పులిని బోనులో బంధించారు. సిర్పూర్ (టి) మండలంలోని మాకిడి గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో పులిని బోనులో బంధించారు. అనంతరం వైద్య పరీక్షల కోసం చంద్రపూర్ తరలించారు. పులికి అవసరమైన వైద్యం అందించిన తర్వాత తడోబా పులుల సంరక్షణ కేంద్రంలో వదిలిపెట్టనున్నట్లు సమాచారం. కానీ జిల్లా అటవీ శాఖ అధికారులు మాత్రం దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. పులిని పట్టుకున్న వారిలో అటవీశాఖ అధికారులు శ్వేతా, పవన్‌కుమార్, ప్రకాష్‌జాడే, సిబ్బంది ఉన్నారు. అటవీ శాఖ అధికారులు చేపట్టిన ఈ టాస్క్‌పై ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పులి ఇద్దరిని చంపేసింది.

# బైక్ బోల్తాపడి ఉపాధ్యాయుడి దుర్మరణం

**వాంకిడి, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ఖమాన గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం బైక్ బోల్తాపడి నిర్మల్ జిల్లా నర్సాపురం మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన తోట గంగాధర్ 30, మృతి చెందాడు. గంగాధర్ నవేగూడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం కాగజ్ నగర్ వెళ్లి వస్తున్న క్రమంలో ఖమాన గ్రామ శివారులోని మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. కోన ఊపిరితో రోడ్డు పై పడిఉన్న గంగాధరను అడుగగా వెళ్లిన వారు గమనించి 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

## స్వచ్ఛందంగా

# భైంసా బంద్



**భైంసా, జనవరి 1 (ప్రభాత సమాచారం)**
ముధోల్ తాలూకా వ్యాప్తంగా పలు ఆలయాల్లో వరుస చోరీ ఘటనలను నిరసిస్తూ బుధవారం హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బంద్‌కి పిలుపు నివ్వగా స్వచ్ఛందంగా దుకాణ సముదాయాలు బంద్‌ను పాటిస్తున్నాయి. మంగళవారం నాగదేవత ఆలయంతో పాటు ఇటీవల బైంసా పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం, నరసింహ స్వామి ఆలయం, పంచముఖి హను మాన్ ఆలయంతో పాటు డివిజన్ పరిధిలోని వానల్పాడ్, పార్డీ (బి) గ్రామాల్లో పలు ఆలయాల్లో చోటుచేసుకున్న ఘటనలు తెలిసిందే. దేవాలయాల్లో వరుస చోరీ ఘటనలు చోటు చేసుకుంటున్న తరుణంలో అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టాలని సమితి సభ్యులు కోరారు. సంబంధిత ఘటనలను నిరసిస్తూ, చోరీలకు పాల్పడుతున్న దొంగలను వెంటనే పట్టుకోవాలనే డిమాండ్‌తో బుధవారం బంద్‌కు పిలుపునిచ్చినట్లుగా హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి వెల్లడించారు. బంద్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టారు.